


బుడిబుడి నడకలతో కృష్ణ వేషధారణ చిన్నారి నాగ వెంకట అనిరుధ్. చేతిలో మురళి, తలలో నెమలి పించాలతో అలరించారు.


# మనం

కృష్ణా / గుంటూరు

ఎన్‌టీఆర్ - బాపట్ల - పల్నాడు

శనివారం | 5 | సెప్టెంబర్ | 2026 | పేజీలు: 8


# కేడీసీసీ... నయా సేవలు


పి.మీరాహుస్సేన్ ఖాన్



3 లో


- గ్రామీణ ప్రాంతాల రైతులకు బ్యాంకింగ్ సేవలు మరింత సులభం
- రూ. 1,800 కోట్ల బిజినెస్ వృద్ధి
- పిఎసియస్ కంప్యూటరీకరణ, యుపిఐతో కేడీసీసీ బ్యాంక్‌లో సరికొత్త మార్పులు
- శేరిలక్ష్మీపురం నూతన కేడీసీసీ బ్యాంక్ బ్రాంచిని ప్రారంభించిన మాజీ మంత్రి, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురామ్

-మచిలీపట్నం,కృష్ణా జిల్లా బ్యూరో




2 లో


పరిశుభ్రత ప్రమాణాలు పాటించని

## హోటళ్లకు జరిమానాలు

లోపాలను సరిదిద్దకుంటే తదుపరి చర్యలు తప్పవు

# ప్రజల చెంతకే పాలన..

- సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యం
- ప్రజల నుంచి నేరుగా వినతుల స్వీకరణ
- ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య


5 లో




# కియా సోరెంటో ఎస్యూవీను ఆవిష్కరించిన కియా ఇండియా




**విజయవాడ,సెప్టెంబర్,04,(మనం న్యూస్):** భారతదేశపు ప్రీమియం మూడు వరుసల ఎస్యూవీ సెగ్మెంట్లోకి బ్రాండ్ ప్రవేశిస్తున్నందున, కియా ఇండియా కియా సోరెంటోను ప్రారంభ ధరలకు డీజిల్కు రూ. 27.99 లక్షల నుండి మరియు హైబ్రిడ్ (ఎక్స్-షోరూమ్) కోసం రూ. 29.49 లక్షల నుండి ప్రారంభించింది. ఈ సందర్భంగా కియా ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ గ్వాంగు లీ మాట్లాడుతూ, కియా యొక్క అత్యంత విజయవంతమైన ఎస్యూవీ నేమ్ప్లేట్లలో ఒకదానిని భారతీయ కస్టమర్లకు తీసుకురావడంతో పాటు, లాంచ్ భారతదేశంలో కియా యొక్క మొట్టమొదటి హైబ్రిడ్ ఆఫర్ను పరిచయం చేసిందన్నారు. ఇండియా స్పెక్ సోరెంటోతో రియల్ టైమ్ జనరేటివ్ ఏఐ సామర్థ్యాలతో కియా ఏఐ అసిస్టెంట్ యొక్క గ్లోబల్ డెబ్యూని తీసుకువస్తుంది, ఈ సామర్థ్యాన్ని అందించే దాని విభాగంలో ఇది మొదటిది. కియా యొక్క గ్లోబల్ డిజైన్ ఫిలాసఫీని తదుపరి తరం ఇన్-కార్ టెక్నాలజీ, అధునాతన భద్రత, ప్రీమియం సౌకర్యం మరియు విస్తరించిన పవర్ట్రెయిన్ ఎంపికతో కలిపి, భారతదేశంలోని ప్రీమియం ఎస్యూవీ కస్టమర్ల అభివృద్ధి చెందుతున్న అంచనాలను పరిష్కరించడానికి సోరెంటో రూపొందించబడింది. కియా సోరెంటో కోసం అధికారిక డెలివరీలు ఈరోజు నుండి, అంటే 04 సెప్టెంబర్ 2026 నుండి దేశవ్యాప్తంగా ప్రారంభమవుతాయన్నారు. భారతదేశంలో కియాకు ఈ ముఖ్యమైన మైలురాయి అని, 'కియా సోరెంటో రాక, మేము మొదటిసారిగా ప్రీమియం మూడు వరుసల ఎస్యూవీ లోకి ప్రవేశించినందున, కియా భారతదేశ ప్రయాణంలో ఒక నిర్ణీత మైలురాయిని సూచిస్తుందన్నారు. భారతదేశం, భారతదేశం కోసం, దాని రాక వినియోగదారులకు సెగ్మెంట్లో బలవంతపు కొత్త ఎంపికను అందిస్తుందని చెప్పారు.

# జుజ్జూరులో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

**వీరులపాడు సెప్టెంబర్ 04, మనం న్యూస్:** వీరులపాడు మండలం లో జుజ్జూరు గ్రామంలోని శ్రీ యోగానంద లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం నందు శుక్రవారం రోజున శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని ₹ఉట్టికొట్టే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీ చైర్మన్ కాపా రాంబాబు తో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం ఉట్టికొట్టే కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చీఫ్ విప్ జీవీ



**పల్నాడు వినుకొండ సెప్టెంబర్: 4 (మనం న్యూస్ ప్రతినిధి)** వినుకొండ ప్రజల దశాబ్దాల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతున్నామని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. నాగార్జునసాగర్ జలాలతో నిండుతున్న సింగర చెరువును శుక్రవారం ఆయన పరిశీలించి అధికారులతో సమీక్షించారు. ప్రతి ఇంటికీ రోజూ సురక్షిత నీరు ఇవ్వడమే తమ లక్ష్యమని, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు,తో మాట్లాడి ప్రత్యేకంగా సాగర్ నీటిని విడుదల చేయించినట్లు చెప్పారు.నియోజకవర్గంలోని అన్ని తాగునీటి చెరువులను నింపి ప్రజలతో పాటు పశువుల దాహార్తిని తీరుస్తామన్నారు. శాశ్వత తాగునీటి పథకం పనులను శరవేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు,కూటమి నాయకులు ,అధికారులు పాల్గొన్నారు.

# కృష్ణాష్టమి వేడుకల్లో భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలిచిన చిన్నారులు

**విజయవాడ; సెప్టెంబర్ 4 మనం న్యూస్:** కేంబ్రిడ్జ్మాంటిస్సోరి - కరీర్వాక్ ఫౌండేషన్ స్కూల్లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధా గోపికల వేషధారణల్లో అలరించారు. అయితే ఈ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది ముస్లిం కుటుంబాలకు చెందిన చిన్నారులు సైతం కృష్ణుడు, రాధ వేషాలు ధరించి వేడుకల్లో పాల్గొనడం. మతాలు వేరైనా.. మనసులు ఒక్కటేనని, పండుగలు వేరైనా ఆనందం అందరిదీ ఒకటేనని ఈ







చిన్నారులు చాటి చెప్పారు. ఒకరి పండుగను మరొకరు గౌరవిస్తూ, సంస్కృతులను పంచుకుంటూ, ప్రేమతో కలిసి జరుపుకోవడమే నిజమైన భారతీయత. చిన్నారుల వేషధారణ చూసిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. చిన్న వయసులోనే మత సామరస్యం, సోదరభావం, పరస్పర గౌరవం వంటి విలువలను పిల్లల్లో పెంపొందించడం అభినందనీయమని పలువురు కొనియాడారు.

# రానున్న మున్సిపల్ ఎన్నికలపై శాఖాధిపతులతో టెలికాన్ఫరెన్స్

**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**



**విజయవాడ,సెప్టెంబర్, 04,(మనం న్యూస్):** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర శుక్రవారం ఉదయం నగరపాలక సంస్థ శాఖాధిపతులతో రానున్న మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లపై టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి అదనపు కమిషనర్ జనరల్ను నోడల్ అధికారిగా నియమించగా, అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. గత మున్సిపల్ ఎన్నికల్లో అనుసరించిన విధానాలను పరిశీలించి, అవసరమైన మేరకు ఈ ఎన్నికల్లో కూడా సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ఇృఅ వారు కోర్టు ప్రొసీడింగ్స్ అమలు చేయాలని ఆదేశించగా వాటిని క్షుణ్ణంగా పరిశీలించి, ఆదేశాలకు అనుగుణంగా వార్డుల డీలిమిటేషన్ ప్రక్రియను పూర్తి చేసి, తదనంతర చర్యలను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. డీలిమిటేషన్ ప్రక్రియ అనంతరం ప్రతి వార్డులో ఏర్పాటు చేయాల్సిన పోలింగ్ కేంద్రాలను ముందుగానే గుర్తించాలని, పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు, విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం, ర్యాంపులు తదితర సౌకర్యాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అలాగే ప్రతి పోలింగ్ కేంద్రానికి సంబంధించిన ఓటర్ల సంఖ్య, ఇతర అవసరమైన వివరాలను సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో నగరపాలక సంస్థకు చెందిన ప్రతి శాఖకు బాధ్యత ఉంటుందని కమిషనర్ స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియలో అప్పగించిన బాధ్యతలను అధికారులు సమర్థవంతంగా నిర్వహిస్తూ, పరస్పర సమన్వయంతో పనిచేసి మున్సిపల్ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలని ఆదేశించారు.


# పరిశుభ్రత ప్రమాణాలు పాటించని హోటళ్లకు జరిమానాలు



**లోపాలను సరిదిద్దకుంటే తదుపరి చర్యలు తప్పవు**

**విజయవాడ,సెప్టెంబర్, 04,(మనం న్యూస్):** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు, శుక్రవారం ఉదయం ప్రజారోగ్య విభాగం అధికారులు 37వ డివిజన్ పరిధిలోని కెనాల్ రోడ్ ప్రాంతంలో పలు హోటళ్లను తనిఖీ చేశారు.ఈ తనిఖీలలో భాగంగా కెనాల్ రోడ్ ప్రాంతంలోని స్వీట్ మ్యాజిక్, తాజ్ హోటల్, హోటల్ సాయి సరోవర్, మంగమ్మ కిచిడీ సెంటర్లను అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా హోటళ్లలోని వంటగదులను పరిశీలించగా, కిచెన్ గదులకు టైల్స్ లేకపోవడం, గోడలు మరియు ఇతర ప్రదేశాల్లో బూజు ఏర్పడటం, గోడలు అపరిశుభ్రంగా ఉండటం, ఆహార పదార్థాలను మూతలు లేకుండా నిల్వ చేయడం, నిల్వ ఉన్న ఆహార పదార్థాలను గుర్తించడం, పరిసరాల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొని ఉండటం వంటి పలు లోపాలు గుర్తించారు.అదేవిధంగా, నాణ్యమైన తాగునీటిని వినియోగించకపోవడం, మరుగుదొడ్లు సరిపడా లేకపోవడం, ఉన్న మరుగుదొడ్లను సక్రమంగా నిర్వహించకపోవడం, పరిశుభ్రత ప్రమాణాలను పాటించకుండా అపరిశుభ్ర వాతావరణంలో ఆహార పదార్థాల తయారీ మరియు విక్రయాలు నిర్వహించడం వంటి అంశాలను అధికారులు గుర్తించారు.ప్రజారోగ్యానికి విఘాతం కలిగించే విధంగా అపరిశుభ్ర పరిస్థితుల్లో హోటల్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నందుకు సంబంధిత మూడు హోటళ్లకు ఒక్కొక్కదానికి రూ.5,000 చొప్పున జరిమానా విధించి నోటీసులు జారీ చేశారు. నోటీసులు అందుకున్న హోటల్ యాజమాన్యాలు నిర్ణీత గడువులోగా గుర్తించిన లోపాలను పూర్తిస్థాయిలో సరిదిద్దుకోవాలని, పరిశుభ్రత మరియు ప్రజారోగ్య నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు ఆదేశించారు. నిర్ణీత గడువులోగా లోపాలను సరిచేయని పక్షంలో సంబంధిత యాజమాన్యాలపై చట్టప్రకారం తదుపరి చర్యలు చేపట్టడంతో పాటు, అవసరమైతే ట్రేడ్ లైసెన్సులను రద్దు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.నగరంలోని హోటళ్లు, రెస్టారెంట్లు, ఆహార విక్రయ కేంద్రాల నిర్వాహకులు పరిశుభ్రత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, నాణ్యమైన ఆహారం మరియు సురక్షితమైన తాగునీటిని ప్రజలకు అందించాలని అధికారులు సూచించారు.ఈ తనిఖీలలో సర్కిల్-1 శానిటరీ సూపర్వైజర్ డి. సోమరాజు, శానిటరీ ఇన్స్పెక్టర్లు బి. యోగేంద్ర కుమార్, ఎం. రవిశంకర్ మరియు ప్రజారోగ్య విభాగం సిబ్బంది పాల్గొన్నారు.






# గ్రామీణ ప్రాంతాల రైతులకు బ్యాంకింగ్ సేవలు మరింత సులభం

- **రూ. 1,800 కోట్ల బిజినెస్ వృద్ధి.. పిఏసియస్ కంప్యూటరీకరణ, యుపిఐతో కేడీసీసీ బ్యాంక్లో సరికొత్త మార్పులు**
- **శేరిలక్ష్మీపురం నూతన కేడీసీసీ బ్యాంక్ బ్రాంచిని ప్రారంభించిన మాజీ మంత్రి, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురామ్**



మచిలీపట్నం,కృష్ణా జిల్లా బ్యూరో: కృత్తివెన్ను మండలం లక్ష్మీపురం గ్రామంలో కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ లిమిటెడ్ (కేడీసీసీ బ్యాంక్) శేరిలక్ష్మీపురం నూతన బ్రాంచి ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురామ్ , పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ పాల్గొని నూతన బ్రాంచిని ప్రారంభించారు.ఈ సందర్భంగా కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురామ్ మాట్లాడుతూ.. తాను కేడీసీసీ బ్యాంక్ చైర్మన్గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం బ్యాంక్ మొత్తం వ్యాపారాన్ని ₹1,800 కోట్ల మేర పెంచామని తెలిపారు. రైతులు, ఖాతాదారులకు మరింత మెరుగైన సేవలు అందించడంతో పాటు కేడీసీసీ బ్యాంక్ను ఆధునిక సహకార బ్యాంకింగ్ వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు అనేక కీలక సంస్కరణలు చేపట్టామని చెప్పారు.గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు బ్యాంకింగ్ సేవలు మరింత సులభంగా అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పిఏసియస్) కంప్యూటరీకరణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చామని నెట్టెం శ్రీరఘురామ్ తెలిపారు. పిఏసియస్ లను ఆధునికీకరించడం ద్వారా రైతులకు రుణాలు, డిపాజిట్లు, వ్యవసాయ సేవలు, ఇతర బ్యాంకింగ్ సేవలను వేగంగా, పారదర్శకంగా అందించే అవకాశం ఏర్పడిందన్నారు.అదేవిధంగా సహకార రంగంలో డిజిటల్ బ్యాంకింగ్ను ప్రోత్సహిస్తూ పిఏసియస్ స్థాయిలో యుపిఐ సేవలను ప్రవేశపెట్టిన తొలి బ్యాంక్గా కేడీసీసీ బ్యాంక్ ప్రత్యేక గుర్తింపు సాధించిందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా డిజిటల్ చెల్లింపులను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా రైతులు, ఖాతాదారులకు బ్యాంకింగ్ సేవలు మరింత సులభతరమయ్యాయని అన్నారు.



### బంటుమిల్లి పరిధిలో డ్వాక్రా మహిళలక్కు 2.50 కోట్ల రుణాల పంపిణీ



ఈ సందర్భంగా బంటుమిల్లి బ్రాంచి పరిధిలో డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులకు ₹2.50 కోట్ల విలువైన రుణాలను పంపిణీ చేశారు. మహిళా సంఘాలకు ఆర్థికంగా చేయూతనందిస్తూ, స్వయం ఉపాధి, చిన్నతరహా వ్యాపారాలు, కుటుంబ ఆర్థిక అభివృద్ధికి అవసరమైన రుణ సౌకర్యాలను అందించడం ద్వారా మహిళా సాధికారతకు కేడీసీసీ బ్యాంక్ అండగా నిలుస్తోందని నెట్టెం శ్రీరఘురామ్ తెలిపారు.రైతుల సంక్షేమంతో పాటు గ్రామీణ మహిళల ఆర్థిక స్వావలంబనకు కూడా సహకార బ్యాంకింగ్ వ్యవస్థ ద్వారా ప్రోత్సాహం అందిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. అర్హత కలిగిన రైతులు, మహిళా సంఘాలు, ఖాతాదారులకు అవసరమైన రుణ సౌకర్యాలను సకాలంలో అందించేందుకు కేడీసీసీ బ్యాంక్ నిరంతరం కృషి చేస్తోందన్నారు.రైతుల సంక్షేమమే కేడీసీసీ బ్యాంక్ ప్రధాన లక్ష్యమని నెట్టెం రఘురామ్ గారు స్పష్టం చేశారు. రైతులకు అవసరమైన రుణ సౌకర్యాలను సకాలంలో అందించడంతో పాటు, వారి ఆర్థిక అవసరాలకు అనుగుణంగా సహకార వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు.పిఏసియస్ లు కేవలం రుణాలు అందించే సంస్థలుగా కాకుండా రైతులకు అవసరమైన వివిధ సేవలను అందించే బలమైన గ్రామీణ ఆర్థిక కేంద్రాలుగా అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.శేరిలక్ష్మీపురం నూతన బ్రాంచి అందుబాటులోకి రావడంతో లక్ష్మీపురం మరియు పరిసర ప్రాంతాల రైతులు, ఖాతాదారులకు కేడీసీసీ బ్యాంక్ సేవలు మరింత చేరువ కానున్నాయని నెట్టెం శ్రీ రఘురామ్ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలను మరింత విస్తరిస్తూ, రైతుల ఆర్థిక అవసరాలకు అనుగుణంగా సహకార బ్యాంకింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి నిరంతరం కృషి చేస్తామని అన్నారు.

### సహకార వ్యవస్థతో గ్రామీణ ఆర్థికాభివృద్ధి

పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు రైతుల సంక్షేమానికి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ఎంతో కీలకమైనవని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు అవసరమైన రుణ సౌకర్యాలు, వ్యవసాయ సేవలు అందించడంలో సహకార బ్యాంకులు, పిఏసియస్ లు ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు.సహకార సంఘాల పాలకవర్గాలు సమర్థవంతంగా, బాధ్యతాయుతంగా పనిచేసినప్పుడే రైతులకు మరింత మెరుగైన సేవలు అందించడంతో పాటు వారికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని సకాలంలో అందించేందుకు అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రైతుల అవసరాలను గుర్తించి వారికి అందుబాటులో ఉండే విధంగా సహకార వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ సీఈఓ శ్యామ్ మనోహర్ , జీఎం చంద్రశేఖర్ , కూటమి నాయకులు, కార్యకర్తలు, సహకార సంఘాల ప్రతినిధులు, సంబంధిత అధికారులు, రైతులు, డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులు, ఖాతాదారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.





# కొత్త పింఛన్లు పారదర్శకంగా మంజూరు చేస్తాం



▸▸ **అర్హతే ప్రామాణికం.. రాజకీయాలకు తావు లేదు**

▸▸ **ఎమ్మెల్యే గళ్ళా మాధవి**

**గుంటూరు పశ్చిమ సెప్టెంబర్: 4 (మనం న్యూస్ ప్రతినిధి):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అతి త్వరలో అర్హులైన వారందరికీ దశలవారీగా కొత్త పింఛన్లు మంజూరు చేయనున్నట్లు ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.పెన్షన్ మంజూరులో అర్హతే ప్రామాణికమని రాజకీయాలకు తావు లేదని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. శుక్రవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి, ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమంలో ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన అర్జీలు స్వీకరించారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటిని సంబంధిత అధికారుల ద్వారా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వానికి ప్రజల సంక్షేమమే ప్రధాన లక్ష్యమని,ప్రజల నుంచి వచ్చే ప్రతి వినతిని సానుకూలంగా పరిశీలిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం ప్రజా గ్రీవెన్స్లో కొత్త పింఛన్ల కోసం పెద్ద సంఖ్యలో అర్జీలు అందుతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం అతి త్వరలో అర్హులైన వారందరికీ దశలవారీగా కొత్త పింఛన్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు.పేద,బడుగు బలహీన వర్గాలకు అండగా నిలిచే ఈ అవకాశాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అనర్హుల పేరుతో నిజమైన లబ్ధిదారులను పింఛన్ల జాబితా నుంచి తొలగించి,అధికార పార్టీకి చెందిన వారికి ప్రయోజనం చేకూరే విధంగా వ్యవహరించారని ఎమ్మెల్యే విమర్శించారు. సంక్షేమ పథకాల అమలులో రాజకీయ పక్షపాతం చోటుచేసుకోవడం వల్ల ఎంతో మంది అర్హులు నష్టపోయారని అన్నారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో మాత్రం సంక్షేమ పథకాల అమలులో 'అర్హతే ప్రామాణికం'అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్పష్టం చేశారు. పింఛన్ల మంజూరులో ఎటువంటి రాజకీయ జోక్యాలకు తావు ఉండదని, అర్హులైన ప్రతి ఒక్కరికీ పూర్తిస్థాయి పారదర్శకతతో పింఛన్లు అందేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు.ప్రజల సంక్షేమం విషయంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని,అర్హులైన ఒక్క లబ్ధిదారుడూ నష్టపోకుండా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు.

# గురజాల నగర పంచాయతీలో రూ.18.62 కోట్లతో అమృత్ 2.0 తాగునీటి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన ఎంపీ,ఎమ్మెల్యే



**పల్నాడు గురజాల సెప్టెంబర్ : 4 (మనం న్యూస్ ప్రతినిధి)** గురజాల నగర పంచాయతీ పరిధిలోని ప్రజల తాగునీటి అవసరాలను శాశ్వతంగా తీర్చేందుకు రూ.18.62 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించతలపెట్టిన 'అమృత్ 2.0' (అమృత్ 2.0) తాగునీటి ప్రాజెక్టు పనులకు నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయులు, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గురజాల నగర పంచాయతీలో సుమారు 32,000 మంది దాహార్తిని తీర్చేలా ఈ అమృత్ 2.0 పథకానికి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ప్రతి ఇంటా స్విచ్ వేస్తే విద్యుత్ ఎలా వస్తుందో,ప్రతి ఇంటికీ ట్యాప్ తిప్పగానే అలా 24/7 స్వచ్ఛమైన మంచి నీరు వచ్చేలా 'ఇంటింటికీ కుళాయి కనెక్షన్ సదుపాయం కల్పిస్తున్నట్లు స్పష్టం చేశారు. కేవలం స్థానిక బోర్లు, బావులపైనే ఆధారపడకుండా, నిరంతరం సరఫరా ఉండేలా సాగర్ నది మూలాల నుంచి మంచినీటిని పైప్లైన్ ద్వారా తరలించి, శాశ్వత మంచినీటి సమస్యను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. గురజాల ఒక్కటే కాకుండా పార్లమెంట్ పరిధిలోని అన్ని మున్సిపాలిటీలలో తాగునీటి అవసరాల కోసం రూ.800 కోట్లకు పైగా నిధులు కేటాయించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి కి కృతజ్ఞతలు.ఈ సందర్భంగా ఎన్నికల సమయంలో ప్రజలు ఇచ్చిన ప్రధాన విజ్ఞప్తులైన తాగునీరు, సాగునీరు సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి, నిధులు మంజూరు చేసిన గౌరవ ముఖ్యమంత్రి కి. ఎంపీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ శంకుస్థాపన కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, స్థానిక నాయకులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలో రూ. 49.61 కోట్లతో 'అమృత్ 2.0' తాగునీటి పథకానికి శంకుస్థాపన చేసిన ఎంపీ, ఎమ్మెల్యే



**పల్నాడు దాచేపల్లి సెప్టెంబర్:4 (మనం న్యూస్ ప్రతినిధి)** దాచేపల్లి నగర పంచాయతీ ప్రజల తాగునీటి అవసరాలను శాశ్వతంగా తీర్చేందుకు రూ. 49.61 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న 'అమృత్ 2.0' (అమృత్ 2.0) మంచి నీటి పథకానికి శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, స్థానిక ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ దాచేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి ఇంటికీ సురక్షితమైన మంచి నీటిని అందించేందుకు ఈ 'అమృత్ 2.0'పథకం ఎంతో దోహదపడుతుం దన్నారు. గురజాల, మాచర్ల రెండు నియోజకవర్గాల పరిధిలో వాటర్ గ్రిడ్ పథకం ద్వారా ప్రతి గ్రామానికి,ప్రతి ఇంటికీ మంచినీరు అందించేందుకు రూ. 1,200 కోట్లు వెచ్చిస్తున్నామన్నారు. 'దాచేపల్లిలో మొత్తం 12 వేల ఇళ్లు ఉండగా,ఇప్పటివరకు కేవలం 3,100 ఇళ్లకు మాత్రమే నీటి కనెక్షన్ ఉంది. అమృత్ 2.0 ద్వారా కొత్తగా మరో 4,300 ఇళ్లకు కనెక్షన్లు అందించడమే కాకుండా,పాత 3,100 కనెక్షన్లతో కలిపి మొత్తం 7,400 పైగా గృహాలకు తాగునీటి సదుపాయం కల్పిస్తున్నాం.ఇప్పటివరకు సరైన వాటర్ సోర్స్ లేకపోవడం వల్ల బోర్లు, గ్రౌండ్ వాటర్ ద్వారా మాత్రమే నీటిని సరఫరా చేసేవారు.ఇప్పుడు బుగ్గవాగును ప్రధాన వనరుగా తీసుకుని ప్రతి ఇంటికీ ఆన్-డిమాండ్ మంచినీటిని అందిస్తాం.'అని ఎంపీ అన్నారు.నరసరావుపేట పార్లమెంట్ పరిధిలో మున్సిపాలిటీల్లో తాగునీటి ప్రాజెక్టుల కోసం దాదాపు రూ. 800 కోట్లు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి కి,పురపాలక శాఖ మంత్రి నారాయణ కి.ఎంపీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# గుంటూరు జిల్లాలో ప్రత్యేక ట్రాఫిక్ డ్రైవ్ 501

▸▸ **చలానాలు, రూ.3,33,360 /- జరిమానా**


▸▸ **805 మందికి రోడ్డు భద్రత అవగాహన**



**గుంటూరు సెప్టెంబర్ :4( మనం న్యూస్ ప్రతినిధి):**గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపీఎస్ ఆదేశాల మేరకు గుంటూరు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతను మెరుగుపరచడం, ట్రాఫిక్ నిబంధనల అమలును కట్టుదిట్టం చేయడం లక్ష్యంగా నిన్నటి రోజు(03.09.2026)న సాయంత్రం 4.00 గంటల నుండి రాత్రి 8.00 గంటల వరకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక ట్రాఫిక్ అమలు కార్యక్రమం నిర్వహించబడింది.ఈ ప్రత్యేక డ్రైవ్లో జిల్లాలోని 5 బ్లాక్ స్పాట్లు మరియు మరో 13 హైవే ఎంట్రీ, ఎగ్జిట్ కీలక ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు.ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై మొత్తం 501 చలానాలు నమోదు చేసి రూ. 3,33,360/- జరిమానా విధించారు.ఈ ప్రత్యేక డ్రైవ్ సందర్భంగా నమోదైన ఉల్లంఘనలు కేసులు:హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులపై మరియు కార్ లో సీట్ బెల్ట్ ధరించని వారిపై 120 కేసులు.ట్రిపుల్ రైడింగ్ - 12 కేసులు.ప్రమాదకరంగా వాహనాలు నడిపిన వారిపై - 37 కేసులు.రాంగ్ సైడ్ డ్రైవింగ్ - 8 కేసులు.మొబైల్ ఫోన్ మాట్లాడుతూ వాహనం నడిపిన వారిపై - 16 కేసులు.వాహనానికి సైలెన్సర్ లేకుండా 1.మైనర్ డ్రైవింగ్ చేసినవారు 12 కేసులు నమోదు చేశారు. ఇతర మోటారు వాహన చట్ట ఉల్లంఘనలకు సంబంధించి 314 కేసులు నమోదు చేసినారు.అదేవిధంగా రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు మరియు హెల్మెట్ వాడకంపై జిల్లా వ్యాప్తం గా 18 రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.5 బ్లాక్ స్పాట్స్, 10 హైవే ఎంట్రీ పాయింట్లు,3 ఎగ్జిట్ పాయింట్లు వద్ద ఈ కార్యక్రమాల ద్వారా 250 మంది డ్రైవర్లు,300 మంది విద్యార్థులు,255 మంది సాధారణ ప్రజలకు రోడ్డు భద్రత,ట్రాఫిక్ నిబంధనల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.మొత్తం 805 మంది ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా గుంటూరు జిల్లా ఎస్పీ మాట్లాడుతూ,ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ప్రతి పౌరుడి బాధ్యత అని,హెల్మెట్ ధరించడం,మద్యం సేవించి వాహనాలు నడపకపోవడం, మొబైల్ ఫోన్ వినియోగించకుండా డ్రైవింగ్ చేయడం ద్వారా,రాత్రివేళ నిదర టైములో డ్రైవింగ్ చేయ కుండా ఉండటం వలన ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. ప్రజల ప్రాణ భద్రతే లక్ష్యంగా ఇటువంటి ప్రత్యేక అమలు డ్రైవ్లు,రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా నిరంతరం కొనసాగుతాయని గుంటూరు జిల్లా పోలీసులు తెలిపారు.



# ఉత్తమ అవార్డు గ్రహీత పల్లవికి ఘన సత్కారం



పామర్రు సెప్టెంబర్ 4 (మనం న్యూస్): ప్రభుత్వ సంక్షేమ పథకాలను సకాలంలో అర్హులైన పేదలకు అందించడంలో సమాజంలో విధుల్లో తనదైన ముద్ర వేస్తూ, విశేష సేవలు అందించినందుకు గాను ప్రతిష్ఠాత్మక 'ఉత్తమ అవార్డు' దక్కించుకున్న పామర్రు రెండవ గ్రామ సచివాలయ సంక్షేమ సహాయకురాలు బి.పల్లవి గోపికృష్ణ కి స్థానికంగా ఘన సత్కారం జరిగింది. ఆగస్టు 15న జరిగిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఆమె రాష్ట్ర మంత్రివర్యులు కొల్లు రవీంద్ర, జాయింట్ కలెక్టర్ నవీన్ మరియు జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ షాహిద్ బాబు చేతుల మీదుగా అధికారికంగా ఈ ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకున్నారు. ఉత్తమ సేవకురాలు అవార్డు అందుకున్న పల్లవి ని అభినందిస్తూ,గురు వారం మనం వనం ఫౌండేషన్ (ట్రస్ట్) డైరెక్టర్ పెనుమాల శ్రీనివాసరావు స్థానిక ప్రముఖులు, అధికారులు మరియు గ్రామస్తుల ఆధ్వర్యంలో రెండవ గ్రామ సచివాలయంలో ప్రత్యేక సత్కార కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమెకు శాలువా కప్పి, పూలమాలలు వేసి, మెమెంటోతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ,పల్లవి తన రంగంలో వృద్ధులకు పెన్షన్లు అందించడంతోపాటు తల్లికి వందనం, ఇతర ప్రభుత్వ సంక్షేమాలను సత్వరమే ప్రజలకు అందిస్తున్న ఘనత పల్లవికే దక్కుతుందన్నారు. ఆమెచూపిన ప్రతిభ, అంకితభావం వల్లే ఈ అధికారిక గుర్తింపు లభించిందని కొనియాడారు. ఆమె సాధించిన ఈ విజయం గ్రామానికి సచివాలయం యానికి ఎంతో గర్వకారణమని, భవిష్యత్తులో ఆమె మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

### కృతజ్ఞతలు తెలిపిన పల్లవి

సత్కారం అనంతరం పల్లవి మాట్లాడుతూ.. స్వాతంత్ర్య దినోత్సవం లాంటి పవిత్రమైన రోజున ప్రభుత్వం నుంచి 'ఉత్తమ అవార్డు' అందుకోవడం తన జీవితంలో మరువలేని అనుభూతి అని ఆనందం వ్యక్తం చేశారు. తన విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ పురస్కారం తనపై బాధ్యతను మరింత పెంచిందని, భవిష్యత్తులో మరింత ఉత్సాహంతో పని చేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయం కార్యదర్శి ఎన్.నరేష్, మహిళ సంరక్షణ కార్యదర్శి రాజేశ్వరి, డి ఎ హుస్సేన్, బిజెపి మండల అధ్యక్షుడు,స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రజల చెంతకే పాలన..




- సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యం
- ప్రజల నుంచి నేరుగా వినతుల స్వీకరణ
- ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

నందిగామ,సెప్టెంబర్4(మనం న్యూస్): ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. నందిగామ పట్టణం కాకాని నగర్లోని తన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా దర్బారులో ఆమె ప్రజల నుంచి నేరుగా వినతులను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ప్రజలు వివిధ సమస్యలను ఎమ్మెల్యే సౌమ్య దృష్టికి తీసుకురాగా, ప్రతి వినతిని ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. ఆయా సమస్యలకు సంబంధించి సంబంధిత అధికారులతో అక్కడికక్కడే మాట్లాడి, ప్రజలకు సత్వర పరిష్కారం అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా, నిబంధనల మేరకు వీలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు .ఈ సందర్భంగా ఎమ్మెల్యే సౌమ్య మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ప్రజలకు దూరంగా ఉండే పాలనకు స్వస్తి పలికి, ప్రజల వద్దకే నేరుగా పాలనను తీసుకువచ్చిందని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను చెప్పుకునేందుకు ఎక్కడికీ వెళ్లాల్సిన అవసరం లేకుండా ప్రజా ప్రతినిధులు, అధికారులు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంద న్నారు. ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన అజెండా అని పేర్కొన్న ఆమె.. నందిగామ నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారం కోసం కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ప్రజా దర్బార్ల ద్వారా ప్రజలతో నేరుగా మమేకమై, వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించడం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమం, అభివృద్ధి, పారదర్శక పాలనకు పెద్దపీట వేస్తూ ముందుకు సాగుతోం దని ఎమ్మెల్యే సౌమ్య తెలిపారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కారం చూపుతున్న ప్రజా దర్బార్కు స్థానిక ప్రజల నుంచి మంచి స్పందన లభించింది.

# ఘనంగా దేవి ఆలయాల్లో శ్రావణమాసం మహోత్సవాలు



నందిగామ,సెప్టెంబర్4(మనంన్యూస్): నంది గామ మండలంలోని పలు దేవి ఆలయాల్లో శ్రావణ మాస నాలుగవ శుక్రవారం పూజలు ఘనంగా నిర్వహించారు. నందిగామ మండలం అంబారుపేట గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ సత్తెమ్మ తల్లి అమ్మ వారికి గాజులమ్మ తల్లిగా ప్రత్యేక అలంకరణలు, విశేష పుష్పార్చనలు వేదోక్తంగా జరిగాయి ఆలయ ఆలయ ఈవో పీవీకే సీతారావమ్మ, ఆలయ కమిటీ చైర్మన్ మంచాల మాధవరావు ధర్మకర్తల మండల సభ్యుల పర్యవేక్షణలో పలు గ్రామాల నుండి భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు, కూడలి గ్రామంలో రాజ రాజరాజేశ్వరీ దేవి అమ్మవారి ఆలయం, పల్లగిరి గట్టుపై కనకదుర్గ కనకమహాలక్ష్మి జ్ఞాన సరస్వతి అమ్మవార్ల త్రిశక్తి పీఠం, గొల్లమూడి శంభు లింగేశ్వర స్వామి ఆలయంలో పార్వతి అమ్మవారు వీర భద్ర స్వామి ఆలయంలో భద్రకాళి అమ్మవార్లకు శ్రీ లలితా త్రిపుర సుందరి దేవిగా ప్రత్యేక అలంకరణలు విశేష అర్చనలు, సామూహిక కుంకుమ పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆయా దేవి ఆలయాల్లో భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు పసుపు కుంకుమ గాజుల పూలు ప్రసాదాలు అందజేశారు.





# దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలో రూ. 49.61 కోట్లతో 'అమృత్ 2.0' తాగునీటి పథకానికి శంకుస్థాపన చేసిన ఎంపీ , ఎమ్మెల్యే




పల్నాడు దాచేపల్లి సెప్టెంబర్:4 (మనం న్యూస్ ప్రతినిధి) దాచేపల్లి నగర పంచాయతీ ప్రజల తాగునీటి అవసరాలను శాశ్వతంగా తీర్చేందుకు రూ. 49.61 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న 'అమృత్ 2.0' (అమృత్ 2.0) మంచి నీటి పథకానికి శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, స్థానిక ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ దాచేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి ఇంటికీ సురక్షితమైన మంచి నీటిని అందించేందుకు ఈ 'అమృత్ 2.0'పథకం ఎంతో దోహదపడుతుంద న్నారు. గురజాల, మాచర్ల రెండు నియోజకవర్గాల పరిధిలో వాటర్ గ్రిడ్ పథకం ద్వారా ప్రతి గ్రామానికి,ప్రతి ఇంటికీ మంచినీరు అందించేందుకు రూ. 1,200 కోట్లు వెచ్చిస్తున్నామన్నారు. 'దాచేపల్లిలో మొత్తం 12 వేల ఇళ్లు ఉండగా,ఇప్పటివరకు కేవలం 3,100 ఇళ్లకు మాత్రమే నీటి కనెక్షన్ ఉంది. అమృత్ 2.0 ద్వారా కొత్తగా మరో 4,300 ఇళ్లకు కనెక్షన్లు అందించడమే కాకుండా,పాత 3,100 కనెక్షన్లతో కలిపి మొత్తం 7,400 పైగా గృహాలకు తాగునీటి సదుపాయం కల్పిస్తున్నాం. ఇప్పటివరకు సరైన వాటర్ సోర్స్ లేకపోవడం వల్ల బోర్లు, గ్రౌండ్ వాటర్ ద్వారా మాత్రమే నీటిని సరఫరా చేసేవారు.ఇప్పుడు బుగ్గవాగును ప్రధాన వనరుగా తీసుకుని ప్రతి ఇంటికీ ఆన్-డిమాండ్ మంచినీటిని అందిస్తాం.'అని ఎంపీ అన్నారు. నరసరావుపేట పార్లమెంట్ పరిధిలో మున్సిపాలిటీల్లో తాగునీటి ప్రాజెక్టుల కోసం దాదాపు రూ. 800 కోట్లు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి కి,పురపాలక శాఖ మంత్రి నారాయణ కి.ఎంపీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## అంగరంగ వైభవంగా జరిగిన పారిశ్రామిక వేత్త

# పుట్టగుంట సతీష్ కుమార్ కుమార్తె నిశ్చితార్థ వేడుక



హనుమాన్ జంక్షన్: సెప్టెంబర్ 04: ( మనం న్యూస్ ): విశ్వహిందూ పరిషత్ జాతీయ ట్రస్టీ,లయన్స్ జిల్లా గవర్నర్,ప్రముఖ పారిశ్రామికవేత్త, పుట్టగుంట సతీష్ కుమార్, రోజా దంపతుల కుమార్తె డాక్టర్ అన్విత,డాక్టర్ దివ్యంత్ చౌదరి నిశ్చితార్థ వేడుక హిందూ సాంప్రదాయం పద్ధతిలో అంగరంగ వైభవంగా కన్నుల పండుగగా జరిగింది.విజయవాడ, కంకిపాడు లోని అయానా హోటల్ అండ్ కన్వెన్షన్ సెంటర్ లో జరిగిన ఈ వేడుకకు ఇరు కుటుంబాల బంధుమిత్రులు, పలువురు ప్రముఖులు ,సినీ ప్రముఖులు ,ప్రజా ప్రతినిధులు, పోలీస్ ఉన్నతాధికారులు, అభిమానులు, బంధు మిత్రులు, పత్రికాధి పతులు, లయన్స్ నాయకులు హాజరై దంపతులు కాబోతున్న నూతన వధూవరులను దీవించారు, అభినందించారు ఆశీర్వదించారు. హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి వచ్చిన అతిథులను పుట్టగుంట సతీష్ కుమార్, రోజాతో విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, జెడ్ పి మాజీ చైర్మన్ గద్దె అనూరాధ ఆహుతులకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమానికి సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్ వి రమణ, మంత్రి కొల్లు రవీంద్ర,కె వి పి రామచంద్రరావు, కామినేని శ్రీనివాస్, దేవినేని ఉమా మహేశ్వర రావు, విజయవాడ పోలీస్ కమీషనర్ రాజశేఖర్, మాజీ మంత్రి మాగంటి బాబు,పత్తిపాటి పుల్లారావు,గోకరాజు గంగరాజు,ఎం ఎల్ ఏ లు యార్లగడ్డ వెంకట్రావు, బొండా ఉమా, బుద్దా వెంకన్న,నెట్టెం రఘురాం, చలసాని ఆంజనే యులు, రావి వెంకటేశ్వరరావు, డాక్టర్ దాసరి వెంకట బాలవర్ధనరావు, నెక్స్ జెన్ ఎం డి అడుసుమిల్లి సుబ్రహ్మణ్యం,ఆంధ్రా హాస్పటల్ ఎం డి రమణమూర్తి, సినీ ప్రముఖులు సుమన్, బాబూ మోహన్,శివాజీ, కిషోర్ దాస్, ఎస్ పి కంచి శ్రీనివాస్,నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్ ( ఇండియా) న్యూఢిల్లీ సంఘ ఉపాధ్యక్షులు బడే ప్రభాకర్, పెన్ రాష్ట్ర సంఘం నాయకులు తాడి రంగారావు, పాల్గొని నవ దంపతులను ఆశీర్వదించారు.



# కృష్ణం వందే జగద్గురుం..

## భక్తిశ్రద్ధలతో శ్రీ శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



**వాసవి కన్యకా పరమేశ్వరి దేవి శ్రీ చక్ర మందిరంలో శ్రీకృష్ణ గోపికల వేషధారణలో చిన్నారులు**

**నందిగామ,సెప్టెంబర్4(మనం న్యూస్):**శ్రీ చక్ర మందిరంలో శ్రీకృష్ణమూర్తికి ప్రత్యేక అలంకరణలు 108 రకాల ప్రసాదాలు నివేదన పూజలు భక్తులు చేశారు. నందిగామలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. నందిగామ పట్టణంలోని సీతారామాంజనేయ స్వామి దేవాలయం, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి శ్రీ చక్ర మందిరంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు, శ్రీకృష్ణమూర్తి ఉత్సవ వర్లకు తిరువంజనం ప్రత్యేక అలంకరణలు పుష్పార్చన పూజలు జరిగాయి, వాసవి కన్యకా పరమేశ్వరి దేవి శ్రీ చక్ర మందిరంలో ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో శ్రీకృష్ణ మూర్తి గోపికల చిన్నారుల వేషధారణ పోటీలు నిర్వహించారు,.. ఆలయ ప్రాంగణంలో చిన్నారులకి ఉట్టికట్టే కార్యక్రమంలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. శ్రీకృష్ణ గోపికల వేషధారణ చిన్నారులకు ఆలయ కమిటీ సభ్యులు చవట నాగేశ్వరావు వనమా బుల్లెబ్బాయి, మారం సత్యనారాయణ, శ్రీ లలితా విష్ణు వాసవి జ్ఞానవాహని మహిళా మండలి సభ్యులు బహుమతుల అందజేశారు..

## జగన్మాత నామస్మరణతో మారుమోగిన దేవి ఆలయాలు

**నందిగామ,సెప్టెంబర్ 4(మనం న్యూస్):** నందిగామ పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి శ్రీ చక్ర మందిరంలో శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవిగా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి భక్తులకు దర్శనమిచ్చింది. పండితులు రాజేష్ శర్మ మణికంఠ పాండే ఆధ్వర్యంలో వాసవి మాతకు విశేష అర్చనలు శ్రీ చక్ర నవ్వార్ణార్చన ఖడ్గమాల, రుద్ర హోమాది క్రతువులు, సామూహిక కుంకుమార్చనలు వేదోక్తంగా



నిర్వహించారు.. శ్రీ మరిడి మహా లక్ష్మి అమ్మవారి ఆలయం రామలింగేశ్వర నగర్



అయ్యప్ప స్వామి దేవాలయంలో శ్రీ మాలికాపురత అమ్మవారి ఆలయం లో అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణలు విశేష అర్చనలు పూజలు జరిగాయి.. దేవి ఆలయాలలో మహిళలకు ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పసుపు కుంకుమ గాజులు ప్రసాదాలు అందజేశారు.

## ఘనంగా ఉస్తేపల్లి గ్రామంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు

**చందర్లపాడు, సెప్టెంబర్ 04(మనం న్యూస్):** చందర్లపాడు మండలం లో ఉస్తేపల్లి గ్రామం నందు శుక్రవారం రోజున శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉట్టికొట్టే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కృష్ణా జిల్లా గొర్రెల,మేకల సంఘం చైర్మన్ దుడ్డుకూరి వెంకట కృష్ణ ఆధ్వర్యంలో ఎంతో ఉత్సాహంగా జారింగినవి. ఈ సందర్భంగా దుడ్డుకూరి వెంకట కృష్ణ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ప్రజలు సాంప్రదాయాలు, పండుగలు మరిచిపోతున్నారని అలా చేయకూడదని అన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం ఉట్టికొట్టే కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## డేటా భద్రత, గోప్యతకు ప్రాధాన్యతనిస్తూ ఎన్ఎక్స్ట్ క్వాంటమ్ ఓఎస్ 1.1

**గాంధీనగర్ సెప్టెంబర్ 4 మనం న్యూస్:** ఏఐ ప్లస్ స్మార్ట్ఫోన్ సంస్థ తన ఎన్ఎక్స్ట్ క్వాంటమ్ ఓఎస్ 1.1ను విడుదల చేసింది. వినియోగదారుల గోప్యతను మరింత బలోపేతం చేయడంతో పాటు, అప్లికేషన్లు పరికరాలను, వ్యక్తిగత డేటాను ఎలా వినియోగిస్తున్నాయనే దానిపై మరింత స్పష్టత, నియంత్రణ కల్పించడమే తాజా నవీకరణ లక్ష్యమని సంస్థ తెలిపింది. డేటా సార్వభౌమత్వం, భద్రతలో భాగంగా ఎన్ఎక్స్ట్ క్వాంటమ్ ఓఎస్ కఠినమైన సార్వభౌమ డేటా సరిహద్దును అమలు చేస్తుందని పేర్కొంది. అప్లికేషన్ డేటా ట్రాఫిక్ను స్థానిక, భారతదేశ ఆధ్వర్యంలోని మౌలిక సదుపాయాల ద్వారానే నిర్వహించేలా వ్యవస్థను రూపొందించినట్లు తెలిపింది. వెయ్యికి పైగా అనుసంధానాలు, 172 ప్రత్యేక గమ్యస్థాన ఐపీలలో మూల నియమాలను ఆటోమేటిక్గా విశ్లేషించే నెట్వర్క్ డయాగ్నొస్టిక్స్ వ్యవస్థను ఇందులో అందించారు. మొత్తం డేటా ట్రాఫిక్, ఐపీ పింగ్లను భారత్లోనే నియంత్రించేలా చర్యలు తీసుకున్నట్లు సంస్థ తెలిపింది. తాజా సంస్కరణలో ఎన్ఎక్స్ట్ ప్రైవసీ డ్యాష్బోర్డ్ను ప్రవేశపెట్టారు. దీని ద్వారా యాప్ అనుమతులను ఒకే వేదికపై సమీక్షించడం, మార్చడం, రద్దు చేయడం వీలవుతుంది. యాప్లు బ్యాక్గ్రౌండ్లో సున్నితమైన పరికర వనరులను వినియోగిస్తున్న సందర్భాలను గుర్తించే అవకాశం కూడా కల్పించారు. అధికంగా లేదా అనవసరంగా ఉన్న అనుమతులపై గోప్యత హెచ్చరికలు




అందుతాయి. ఏఐ+ స్మార్ట్ఫోన్ సీఈఓ మాధవ్ సేత్ మాట్లాడుతూ, సాంకేతికతపై వినియోగదారుల్లో నమ్మకమే తమకు ప్రధానమని తెలిపారు. ప్రాజెక్ట్ ఓపెన్ రివ్యూ 2.0 ద్వారా సమీక్షకులు, పాత్రికేయులు, సాంకేతిక నిపుణులు, ఎథికల్ హ్యాకర్లు ఉత్పత్తులను విడుదలకు ముందే స్వతంత్రంగా పరీక్షించే అవకాశం కల్పిస్తున్నట్లు సంస్థ వెల్లడించింది.

## జమిదగ్గుమిల్లి స్కూల్ టాపర్ 'రామ్ చరణ్'కు ఘన సత్కారం

**రూ. 10,000 నగదు ప్రోత్సాహకం అందించిన 'మనం వనం' ట్రస్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు**

**పదో తరగతి వార్షిక పరీక్షల్లో ప్రథమ స్థానం సాధించినందుకు గుర్తింపువిద్యార్థులను ప్రోత్సహించడంలో 'మనం వనం' ట్రస్ట్ ముందంజ**



**పామర్రు సెప్టెంబర్ 3( మనం న్యూస్ ):** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటూ అసాధారణ ప్రతిభ కనబరిచే పేద విద్యార్థులను ప్రోత్సహించడమే లక్ష్యంగా 'మనం వనం' ఫౌండేషన్ అండ్ ట్రస్ట్ మరోమారు తన ఉదారతను చాటుకుంది. పామర్రు మండల పరిధిలోని జమిదగ్గుమిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత పదో తరగతి వార్షిక పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించి, పాఠశాల స్థాయిలోనే ప్రథమ స్థానంలో నిలిచిన ప్రతిభావంతుడైన విద్యార్థి వెన్న మోహన రామ్ చరణ్ను ట్రస్ట్ ప్రతినిధులు ఘనంగా సత్కరించి,రూ. 10,000 నగదు బహుమతి అందజేశారు. పాఠశాలలోగురువారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో 'మనం వనం' ట్రస్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు గారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన టాపర్గా నిలిచిన వెన్నా మోహన రామ్ చరణ్కు శాలువా కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. విద్యార్థి ఉన్నత చదువులకు ఆర్థికంగా తోడ్పడేలా పది వేల రూపాయలు నగదు ప్రోత్సాహకాన్ని డైరెక్టర్ పెనుమాల శ్రీనివాసరావు స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎంతోమంది ప్రతిభావంతులైన విద్యార్థులు ఉన్నారని, వారికి సరైన ప్రోత్సాహం అందిస్తే అద్భుతాలు సృష్టిస్తారని కొనియాడారు. రామ్ చరణ్ సాధించిన విజయం తోటి విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని, భవిష్యత్తులో అతను మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.తమ పాఠశాల ప్రతిభవంతుడైన విద్యార్థికి ఆర్థిక సాయం అందించి ప్రోత్సహించినందుకు పాఠశాలప్రధానోపాధ్యాయులు చలమల శెట్టి లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయ బృందం 'మనం వనం' ట్రస్ట్కు మరియు డైరెక్టర్ శ్రీనివాసరావుకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు తాడిశెట్టి సత్య, మనం వనం ఫౌండేషన్ ప్రతినిధి పెనుమాల ఉమాప్రతాప్, మండల బిజెపి పార్టీ అధ్యక్షులు ముదునూరి శివకృష్ణ, వాయామ ఉపాధ్యాయుడు బాదర్ల రాము, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



# రామకృష్ణ విద్యాసంస్థలులో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు




నందిగామ, సెప్టెంబర్ 4(మనం న్యూస్)ః నందిగామ పట్టణంలోని రామకృష్ణ విద్యాసంస్థలులో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.పాఠశాల కరెస్పాండెంట్ పూర్ణేష్, డైరెక్టర్ శుభాషిని ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మొదటగా శ్రీ కృష్ణుడు బొమ్మ వద్ద దీపారాధన చేసి పూజా నిర్వహించారు. 'కృష్ణాష్టమి అంటే కేవలం పండుగ కాదు, ధర్మం, సత్యం, భక్తిని పిల్లలకు నేర్పే అవకాశం' అని అన్నారు. ఎల్ కే జి నుండి పదవ తరగతి వరకు విద్యార్థులు పాల్గొన్నారు. చిన్నారుల వేషధారణ పోటీలు, ఉట్టి కొట్టే వేడుక విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాలను పూలతో, కృష్ణుడి బొమ్మలతో అందంగా అలంకరించారు. తదుపరి చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధ వేషధారణలో ఆకట్టుకున్నారు. విద్యార్థులు భగవద్గీత శ్లోకాలు, కోలాటం, భజనలతో అలరించారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు, విద్యార్థులు మానవ పిరమిడ్ గా ఏర్పడి ఉట్టిని కొట్టారు. చిన్నారులు కృష్ణా, రాదా వేషధారణలో న్రత్యాలు తో అలరించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపద్యాయురాలు దుర్గా భవాని,ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చివరగా విద్యార్థులకు ప్రసాదం పంపిణీ చేశారు.



# మోటోవర్స్ 2026కు కౌంట్‌డౌన్ ప్రారంభం

గాంధీనగర్ సెప్టెంబర్ 4 మనం న్యూస్: దేశంలోనే అతిపెద్ద మోటో-కల్చర్ వేడుకగా పేరొందిన రాయల్ ఎన్ఫీల్ మోటోవర్స్ 2026కు కౌంట్డౌన్ ప్రారంభమైంది. నవంబర్ 27 నుంచి 29 వరకు గోవాలోని వాగేటర్లో మూడు రోజులపాటు ఈ వేడుక జరగనుంది. రాయల్ ఎన్ఫీల్ 125వ వార్షికోత్సవం నేపథ్యంలో ఈ ఏడాది మోటోవర్స్ను మరింత భారీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మోటార్సైకిళ్లు, సంగీతం, కళ, క్రీడలు, సంస్కృతి, కమ్యూనిటీని కలిపే ఈ వేడుకలో తొలి విడత కళాకారుల జాబితాను నిర్వాహకులు ప్రకటించారు. ప్రధాన వేదికపై రెబెల్, లిఫాఫా, ఫర్హాన్ అక్తర్, సంజిత్ హెగ్డే, ఎంహెచ్ఆర్ అండ్ ఫ్రెండ్స్, ది థింక్ ఫ్లాయిడియన్ ప్రదర్శనలు ఇవ్వనున్నారు. కమ్యూనిటీ స్టేజ్‌పై రుషిల్, మాలి, సుగ్గహన్నీ, కర్టెన్ బ్లూ, కొమోరెబి అండ్ గోయా, ఓజీ షెజ్, అక్సోమానియాక్ వంటి కళాకారులు సందడి చేయనున్నారు. మరిన్ని పేర్లను త్వరలో ప్రకటించనున్నారు. ప్యూర్ స్పోర్ట్ అరీనాలో డర్ట్ ట్రాక్, మోటో పోలో, మౌత్ కా కువాన్, స్లైడ్ స్కూల్, డ్రిఫ్ట్ స్కూల్, ట్రైల్ స్కూల్ వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మోటోవిల్, మోటోరీల్ ద్వారా కళ, హస్తకళలు, వర్క్‌షాప్లు, చర్చలు, రైడింగ్ అనుభవాలు అందుబాటులో ఉంటాయి. 2025లో 40,000 మందికి పైగా హాజరైన ఈ వేడుకకు ఈసారి మరింత భారీ స్పందనను ఆశిస్తున్నారు. ఎర్లీ బర్డ్ రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయి. టికెట్ ధరలు రూ.2,599 నుంచి ప్రారంభమవుతాయి.




# ఎ.వి.ఆర్.పి.ఎమ్ పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం



నందిగామ,సెప్టెంబర్ 4(మనం న్యూస్)ః నందిగామ పట్టణంలోని ఎ.వి.ఆర్.పి.ఎమ్ ఉన్నత పాఠశాలలో బుధవారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు.పాఠశాల ప్రిన్సిపాల్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో విద్యార్థుల చదువు, క్రమశిక్షణ, హాజరు శాతంపై చర్చించారు. విద్యార్థులు సెల్ ఫోన్ లకు దూరంగా ఉండి చదువుపై దృష్టి పెట్టాలని, హోమ్ వర్క్ నిత్యం పూర్తి చేయాలని ఉపాధ్యాయులు సూచించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ - పిల్లలు ఇంటి వద్ద సెల్ ఫోన్ ఎక్కువగా చూడడం, సాయంత్రం పాఠశాల అయ్యాక ఆలస్యంగా ఇంటికి రావడం, హోమ్ వర్క్ చేయకపోవడం వంటి సమస్యలు ఉన్నాయని ఉపాధ్యాయుల దృష్టికి తీసుకువచ్చారు. తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించి, చదువుతో పాటు క్రమశిక్షణ, సంస్కారం నేర్పించాలని కోరారు.పిల్లల గురించి తల్లిదండ్రులు ఉపాధ్యాయులతో చెప్పిన ముఖ్య విషయాలు.... సెల్ ఫోన్ వాడకం గురించి.. సార్ ఇంట్లో పిల్లలు ఎక్కువగా ఫోన్ చూస్తున్నారు, రీల్స్, గేమ్స్ ఆడుతున్నారు. స్కూల్లో కూడా ఫోన్ తీసుకురాకుండా చూడండి.చదువు గురించి.. మా పిల్లాడు ఇంటి దగ్గర చదవట్లేదు, హోమ్ వర్క్ చేయట్లేదు. కొంచెం గట్టిగా చెప్పండి సార్.మా అమ్మాయి లెక్కలు, ఇంగ్లీష్ లో వెనకబడింది, ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టండి. క్రమశిక్షణ గురించి.. స్కూల్ అయ్యాక సాయంత్రం ఆలస్యంగా ఇంటికి వస్తున్నారు, ఎక్కడ తిరుగుతున్నారో తెలియట్లేదు. ఫ్రెండ్స్ తో ఎక్కువగా తిరుగుతున్నారు, చెడు అలవాట్లకు దూరంగా ఉండేలా చూడండి.'తల్లిదండ్రుల వినతి పిల్లల ప్రోగ్రెస్ ప్రతి నెలా మాకు ఫోన్ చేసి చెప్పండి సార్. స్కూల్లో కూడా క్రమశిక్షణతో పాటు సంస్కారం, భక్తి కూడా నేర్పించండి.' ప్రతి విద్యార్థి ప్రగతిని నెలవారీగా తల్లిదండ్రులకు తెలియజేస్తామని ఉపాధ్యాయులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, వందలాది మంది తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# సోనీ నుంచి ఆర్ఎక్స్10-5 విడుదల




గాంధీనగర్ సెప్టెంబర్ 4 మనం న్యూస్: సోనీ ఇండియా తన ఆర్ఎక్స్10 సిరీస్లో ఐదో తరం ఆల్ ఇన్ వన్ కెమెరా ఆర్ఎక్స్10-5ను భారత మార్కెట్లో విడుదల చేసింది. రోజువారీ ఫొటోగ్రఫీతో పాటు వన్యప్రాణులు, క్రీడలు, వీడియో చిత్రీకరణకు అనువుగా రూపొందించిన ఈ కెమెరాలో 24-600 మి.మీ. జీస్ వేరియో-సోన్నార్ టి-స్టార్ ఎఫ్2.4-4.0 లెన్స్, 25 రెట్లు ఆప్టికల్ జూమ్ ఉన్నాయి. 1.0-టైప్ స్టాక్డ్ ఎక్స్మోర్ ఆర్ఎస్ సిఎంఓఎస్ సెన్సార్, బియోన్జ్ ఎక్స్ఆర్ ప్రాసెసింగ్ ఇంజిన్తో సుమారు 20.1 మెగాపిక్సెల్ల సామర్థ్యాన్ని అందిస్తుంది. కృత్రిమ మేధ ఆధారిత రియల్టైమ్ గుర్తింపు ఆటోఫోకస్ ద్వారా మనుషులు, జంతువులు, పక్షులు, కీటకాలు, కార్లు, రైళ్లు, విమానాలను గుర్తించి ట్రాక్ చేయవచ్చు. పూర్తి ఆటోఫోకస్, ఆటో ఎక్స్పోజర్ ట్రాకింగ్తో సెకనుకు 30 చిత్రాల వరకు బ్లాక్అవుట్ రహిత నిరంతర చిత్రీకరణ సదుపాయం ఉంది. వీడియో చిత్రీకరణలో 4కే 120పీ రికార్డింగ్, ఐదు రెట్లు వరకు స్లోమోషన్, యాక్టివ్ ఇమేజ్ స్టెబిలైజేషన్, ఎస్-సినిటోన్, ఎస్-లాగ్3, ఆటో ఫ్రేమింగ్ వంటి ఫీచర్లు ఉన్నాయి. 3.68 మిలియన్ డాట్స్ కలిగిన క్వాడ్-వీజీఏ ఓఎల్ఈడీ వ్యూఫైండర్, 1.62 మిలియన్ డాట్స్ ఎల్సీడీ మానిటర్ను ఏర్పాటు చేశారు. ఎన్పీ-ఎఫ్జెడ్100 బ్యాటరీతో సుమారు 630 స్టిల్ షాట్లు తీయవచ్చు. దుమ్ము, తేమను తట్టుకునే డిజైన్, వై-ఫై, యూఎస్బీ టైప్-సీ కనెక్టివిటీ, స్మార్ట్ఫోన్ అనుసంధానం వంటి సదుపాయాలు ఉన్నాయి. సెప్టెంబర్ 2 నుంచి సోనీ అధీకృత రిటైల్ కేంద్రాలు, సోనీ సెంటర్లు, కెమెరా లాంజ్లు, ఆన్లైన్ విక్రయ వేదికలలో ఈ కెమెరా అందుబాటులోకి వచ్చింది.

# ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి




నందిగామ,సెప్టెంబర్4(మనం న్యూస్)ః ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని పి ఆర్ టి యు ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు షేక్ నవాబ్ జానీ డిమాండ్ చేశారు. గురువారం సమస్యల సేకరణ మరియు సభ్యత్వ నమోదు కార్యక్రమం నందిగామ లోని వివిధ పాఠశాలలలో నిర్వహించారు. ఈ సందర్భంగా నవాబ్ జానీ మాట్లాడుతూ 2010 కంటే ముందు నియామకం పొందిన ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు ప్రభుత్వం నిర్ణయించిన విద్యార్హత కలిగి డీఎస్సీ ద్వారా నియామకం పొంది దీర్ఘకాలిక సేవను అందిస్తూ విద్యా వ్యవస్థకు విశేష సేవలందిస్తున్న సీనియర్ ఉపాధ్యాయులను 31.08.2028 నాటికి టెట్ నందు కంపల్సరీ అర్హత సాధించాలనే నిబంధన సరికాదని అన్నారు. కనీసం 25 ,30 సంవత్సరాల పనిచేసి పదవీ విరమణకు దగ్గరగా ఉన్న సీనియర్ ఉపాధ్యాయులు 150 మార్కులకు గాను 90 మార్కులు అనగా 60% మార్కులు సాధించాలంటే ఎంతో కష్టతరం .అట్లు అర్హత సాధించని ఉపాధ్యాయులను నిర్బంధంగా వృత్తి నుండి తొలగించడానికి అవకాశం ఉన్నదని తెలిపారు.ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి తెచ్చి విద్యాహక్కు చట్టం 2009 లోని సెక్షన్ 23(1) ను భారత పార్లమెంటులో సవరణ చేసి రాష్ట్రంలోని ఐదేళ్లకు పైగా సర్వీసు ఉన్న ప్రభుత్వ ఉపాధ్యాయు లందరికీ టెట్ పరీక్ష రాయడం నుండి మినహాయింపు ఇప్పించవలసిందిగా కోరారు. సభ్యత్వ నమోదు ఐతవరం, కేతవీరునిపాడు, చందాపురం,డివిఆర్ కాలనీ,అడవిరావులపాడు, లింగాలపాడు,తక్కెళ్ళపాడు, పెద్దవరం,చెరువుకొమ్ము వారి పాలెం, అనాసాగరం వివిధ పాఠశాలల సందర్శించి సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పి ఆర్ టి యు నందిగామ మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ముల్లంగి శ్రీనివాసరావు, పటాపంచల రామారావు, పాలపర్తి ప్రసాద్, బండారు శ్రీనివాసరావు, రేగళ్ల నరసింహారావు,వై శివకుమార్, రామలక్ష్మణుడు,మహమ్మద్ రఫీ,ఆరుద్ర కొండ,జాన్ సైదులు,బాల నరసింహారావు, మురళీకృష్ణ,వల్లంకొండ శ్రీనివాసరావు,హనుమత్ కుమార్, డివివి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# 32 వార్డులకు సాధారణ ఓటర్ల జాబితా సిద్ధం

- **నందిగామ పురపాలక సంఘంలో ఓటర్ల జాబితా విడుదల**
- **మునిసిపల్ కమిషనర్ లోవరాజు**

నందిగామ,సెప్టెంబర్4 (మనం న్యూస్)ః రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు నందిగామ పురపాలక సంఘం పరిధిలోని మొత్తం 32 వార్డులకు సంబంధించిన సాధారణ ఓటర్ల జాబితాను అధికారికంగా విడుదల చేసినట్లు మున్సిపల్ కమిషనర్ / ఎన్నికల అధికారి తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ప్రక్రియలో భాగంగా ఈ ఓటర్ల జాబితాను రూపొందించినట్లు పేర్కొన్నారు. ప్రజల సౌకర్యార్థం ఎన్నికల నియమావళి ప్రకారం నందిగామ రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో)కార్యాలయం, సంబంధిత తహసీల్దార్ (ఎంఆర్ఓ) కార్యాలయాల్లో ఓటర్ల జాబితాను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అలాగే పురపాలక పరిధిలోని నిర్దిష్ట ప్రదేశాల్లో, స్థానికంగా గుర్తించిన అన్ని రాజకీయ పార్టీల పార్టీల ప్రతినిధులకు కూడా 32 వార్డుల సాధారణ ఓటర్ల జాబితా సమగ్ర వివరాలను అధికారికంగా పంపిణీ చేసినట్లు వెల్లడించారు.

## అభ్యంతరాలు, ఫిర్యాదులకు అవకాశం

32 వార్డుల సాధారణ ఓటర్ల జాబితాపై ఏవైనా అభ్యంతరాలు లేదా ఫిర్యాదులు ఉన్నట్లయితే సంబంధిత మున్సిపల్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం లేదా ఆర్డీఓ కార్యాలయంలో నిర్ణీత విధానం ప్రకారం సమర్పించవచ్చని అధికారులు సూచించారు.

## ఘనంగా పాఠశాలలో ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలు





నందిగామ,సెప్టెంబర్4(మనం న్యూస్): నందిగామ మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో గురువారం ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఏకత్వ కిడ్స్ పాఠశాల చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపిక, గోప బాలుడు వేషధారణలో చూపరులను ఆకట్టుకున్నారు. ముందుగా పాఠశాల ఆవరణలోని శ్రీకృష్ణుని ప్రతిమకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చిన్నారులతో కలిసి పాఠశాల ఉపాధ్యాయులు ఉట్టి కొట్టించి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం శాంతి ప్రత్యూష, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

## సమాజ నిర్మాణానికి మార్గదర్శకులు ఉపాధ్యాయులు

▸▸ జగ్గయ్యపేట శాసన సభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య )



జగ్గయ్యపేట: సెప్టెంబర్ 4 మనం న్యూస్: ఉపాధ్యాయులే సమాజ నిర్మాణానికి మార్గదర్శకుడని శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ అన్నారు. పట్టణంలోని జేఆర్సి కళాశాల ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భవిష్యత్ తరాలకు జ్ఞానాన్ని అందిస్తూ, వారి ఆలోచనలకు దిశానిర్దేశం చేస్తూ, సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్న ఉపాధ్యాయుల సేవలను స్మరించుకుంటూ జే ఆర్ సి విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. భారతదేశ మాజీ రాష్ట్రపతి, మహోన్నత తత్త్వవేత్త, విద్యావేత్త డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన ఈ కార్యక్రమానికి జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) మాట్లాడుతూ, ఒక విద్యార్థి జీవితాన్ని మార్చే శక్తి ఉపాధ్యాయుడి చేతుల్లో ఉంటుంది. తరగతి గదిలో పాఠాలు బోధించడం మాత్రమే కాదు.. విలువలు, బాధ్యత, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని విద్యార్థుల్లో పెంపొందించడం ద్వారా ఉపాధ్యాయులు నవ సమాజ నిర్మాణానికి పునాదులు వేస్తున్నారు అని అన్నారు. సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర అమోఘమైనదని, విద్యార్థుల వ్యక్తిత్వ వికాసంలో అధ్యాపకుల మార్గదర్శకత్వం అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. తరతరాల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యతను భుజాన వేసుకున్న ఉపాధ్యాయుల సేవలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విద్యాసంస్థల అధ్యాపకులను ఘనంగా సన్మానించి, వారి సేవలను అభినందించారు. కార్యక్రమంలో జే ఆర్ సి విద్యాసంస్థల చైర్మన్ రంగాపురం నరసింహారావు, , సెక్రటరీ కరెస్పాండెంట్ పెనుగొండ వెంకట రాజీవ్ , జే ఆర్ సి విద్యాసంస్థల నిర్వాహకులు కె ఎన్ రమేష్ , జె. తిరుపతిరావు , పి. సుధీర్ , టి. వెంకటేశ్వర రాజు , జే ఆర్ సి కళాశాలలకు చెందిన అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు. విద్యార్థి విజయం వెనుక తల్లిదండ్రుల ఆశీర్వాదం ఉంటే.. ఆ విజయానికి దిశ చూపే గురువు ఉంటాడు. అనే సందేశంతో సాగిన ఈ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు, గురువుల పట్ల గౌరవాన్ని చాటుతూ, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో జే ఆర్ సి విద్యాసంస్థలు చూపిస్తున్న నిబద్ధతను మరోసారి ప్రతిబింబించాయి.

## పలు శుభ కార్యక్రమాల్లో పాల్గొన్న సామినేని దంపతులు



జగ్గయ్యపేట సెప్టెంబర్ 4 మనం న్యూస్: ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను, వారి సతీమణి విమల భాను ఫౌండేషన్ చైర్మన్ సామినేని విమల భాను లు శుక్రవారం పలు శుభ వేడుకలలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. జగ్గయ్యపేట నియోజకవర్గం పెనుగంచిప్రోలులోని కంఠమనేని ఫంక్షన్ హాల్ నందు జగ్గయ్యపేట పట్టణానికి చెందిన మాజీ మున్సిపల్ కౌన్సిలర్ శేషం ప్రసాద్ - సుధారాణి ల కుమారుడు ఫణి భూషణ్ - మనీషా ల వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులకు ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను మరియు వారి సతీమణి సామినేని విమల భాను , ఉదయభాను సోదరులు ప్రముఖ పారిశ్రామికవేత్త సామినేని రవిచంద్ లు పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు.అలాగే పెనుగంచిప్రోలు లోని కళ్యాణమండపం నందు వెంకటాపురం గ్రామానికి చెందిన వెంకటప్పయ్య కుమారుని వివాహ వేడుకకు సామినేని ఉదయభాను దంపతులు హాజరై నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించారు.మండలంలోని భూధవాడ గ్రామానికి చెందిన బాణావత్ నాగరాజు కుమార్తె వివాహ వేడుకల్లో పాల్గొన్న సామినేని ఉదయభాను నూతన దంపతులను ఆశీర్వదించారు. జగ్గయ్యపేట మండలం అనుమంచిపల్లి గ్రామానికి చెందిన నందనమూడి వెంకయ్య కుమార్తె స్వరూప వివాహ వేడుకలలో సామినేని ఉదయభాను పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు.

# గొర్రెల మేకల పట్ల పశువైద్యాధికారులు నిర్లక్ష్యం



వీరులపాడు సెప్టెంబర్ 04, మనం న్యూస్: వీరులపాడు మండలం లో పలు గ్రామాల్లో గొర్రెల మేకల పెంపకదారుల సమస్యలు పట్టించుకునే నాథుడు లేరని గొర్రెల మేక పంపకదారులు వాపోతున్నారు గొర్రెల మేకల పెంపకదారుల పట్ల పశువైద్యాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని శుక్రవారం రోజున ఆవేదన వ్యక్తం చేసినారి, జీవాలకు అనారోగ్యం గురై పశువైద్యాల్ని ఆశ్రయిస్తే కనీసం వైద్యానికి కావలసిన మందులు సరఫరా చేయటం లేదని పంపకదారులు ఆవేద నేత చేస్తూగొర్రెలు మేకల పాపులేషన్ ఆధారంగా మందులు సరఫరా చేయాలని గొర్రెలు మేకల పెంపకందారుల సంఘం (జిఎంపిఎస్) డిమాండ్ చేస్తున్నారు, గొర్రెలు మేకలు పాపులేషన్ ఆధారంగా జీవాలకు డి వార్మింగ్ మందులు సరఫరా చేయాలని గొర్రెలు మేకల పెంపకందారుల సంఘం నాయకులు మరియు రైతు సంఘం నాయకులు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కోట కల్యాణం గొర్రెల మేకల పంపకదారులతో వారు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు స్థానిక గొర్రెల మేకల జీవాల పెంపకదారులు వారు ఎదుర్కొంటున్న సమస్యలను జిఎంపిఎస్ రాష్ట్ర కార్యదర్శి పూసపాటి వెంకట్రావు దృష్టికి తీసుకెళ్లారు, ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి పూసపాటి వెంకట్రావు మాట్లాడుతూ . శుక్రవారం ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు మండలంలోని పలు గ్రామాలలో గొర్రెలు కాపరులు చెప్పిన విషయాలను ప్రభుత్వం దృష్టికి తెస్తున్నాము. సీజనల్ వ్యాధులకు సరిపడా మందులను అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఉన్నది. కానీ ప్రభుత్వం పూర్తిస్థాయిలో వ్యాక్సిన్లు, మందులు సరఫరా చేయడం లేదు.ఏ హాస్పిటల్లో అడిగినా ఇంతవరకే మాకు మందులు రాలేదు మేం ఏం చేయలేమని వైద్యులు చెప్తున్నారు.ఏ గొర్రెల కాపరిని అడిగినా మాకు ఎటువంటి మందులు అందడం లేదు అంటున్నారు.ఒక గ్రామానికి ఇచ్చి మరో గ్రామానికి లేదని చెప్తున్నారు. దీనివలన లక్షలాది జీవాలకు వ్యాక్సిన్లు ,మందులు అందుబాటులో లేని పరిస్థితి ఉన్నది.పశుసంవర్ధక శాఖ అధికారులు స్పందించి ముందుగానే రోగనిరోధక శక్తినిచ్చే ఇంజక్షన్లు, టీకాలు వేయించాలని మందులను ఉచితంగా సరఫరా చేయాలని జిఎంపిఎస్ కోరుతున్నది. ప్రయివేటు మందుల దుకాణాలలో అధిక ధరలకు విక్రయిస్తున్నారు, దీనివల్ల గొర్రెల కాపరులు తీవ్రంగా నష్టపోతున్నారు. అధిక ధరలే కాకుండా నకిలీ మందులు కూడా విక్రయిస్తున్నారు. ఇలాంటి వారిపై డిపార్ట్మెంట్ వారు విచారణ చేసి చర్యలు తీసుకోవాలని, నకిలీ మందులు అమ్మే దుకాణాలపై చర్యలు తీసుకోవాలని,వారి లైసెన్సులు రద్దు చేయాలని, ప్రభుత్వం తరపున ఇవ్వాల్సిన మందులు సరఫరా చేయని వైద్య సిబ్బందిపై తగిన చర్యలు తీసుకోవాలని జిఎంపిఎస్ కోరుతున్నది. కనుక రాష్ట్ర ప్రభుత్వం జీవాల పాపులేషన్కి అనుగుణంగా పూర్తిస్థాయిలో వ్యాక్సిన్ లు, మందులు సరఫరా చేయాలని వైద్యం అందించాలని ఏపీ గొర్రెలు మేకల పెంపకందారుల సంఘం (ఎక్కిఖి) రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు మండలంలో వీరులపాడు ఎల్లంకి అల్లూరు జయంతి జుజ్జూరు గ్రామాల్లో జీవోలకు సరైన వైద్యం అందించట్లేదని గొర్రెల మేకల పెంపకదారులు ఆవేద ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఏంటనే మండలంలో అన్ని గ్రామాలకు గొర్రెల మేకల పెంపకదారులకు వారి సమస్యల్ని అడిగి తెలుసుకుని పశువర్ధక శాఖ తగు చర్యలు తీసుకొని గొర్రెల మేకలను రోగాలు కురికాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు

## గ్రామ గ్రామాన జయప్రద ఫౌండేషన్ ఉచిత వైద్య సేవలు ప్రశంసనీయం



▸▸ ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్

జగ్గయ్యపేట సెప్టెంబర్ 4 మనం న్యూస్: ప్రతి ఒక్కరికి కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందుబాటులోకి తేవాలన్న లక్ష్యంతో జయప్రద ఫౌండేషన్ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ అన్నారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలోని వాసవి కళ్యాణ మండపంలో జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో 210 మందికి కళ్ళజోళ్ళ పంపిణీ కార్యక్రమంలో శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్, ఫౌండేషన్ చైర్మన్ తొండపు దశరథ జనార్ధన్ లు పాల్గొని కళ్ళజోళ్లను అందించారు. గత నెలలో కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపం వద్ద జయప్రద ఫౌండేషన్ చైర్మన్ తొండపు దశరథ జనార్దన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరంలో కంటిలోపములు గుర్తించిన రెండు వందల పదిమందికి శుక్రవారం శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య , ఫౌండేషన్ చైర్మన్ తొండపు దశరథ జనార్దన్ చేతుల మీదుగా కళ్ళజోళ్ళు అందించారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ మాట్లాడుతూ సమాజంలో అట్టడుగు స్థాయిలో ఉన్న పేదలందరకు జయప్రద ఫౌండేషన్ ద్వారా వైద్య సేవలు అందించటం అభినంద నీయమని, నియోజకవర్గంలో గ్రామ గ్రామాన జనార్దన్ అందిస్తున్న సేవలు ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉన్నవని కంటి సమస్యలు ఉన్నవారికి కళ్ళజోడులతో పాటు ఆపరేషన్ కూడా చేయిస్తున్నా న్నరని,అలాగే క్యాన్సర్ సంబంధించిన స్క్రీనింగ్ టెస్ట్ లు, గుండెకు సంబంధించిన ఈసీజీ, టు డి ఎకో టెస్టు ఎంతో విలువైన సేవలు అందిస్తున్నారన్నారు. మెరుగైన ఆరోగ్యం కోసం ఆరోగ్య ఆంధ్ర ప్రదేశ్ కోసం గౌరవ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు స్ఫూర్తితో జనార్ధన్ చేస్తున్న సేవలు ఈ ప్రాంతంలో ఎక్కువ మంది లబ్ధి పొందుతున్నారని అన్నారు. ఫౌండేషన్ చైర్మన్ తొండపుజనార్ధన్ మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం అన్న నందమూరి తారకరామారావు స్ఫూర్తితో గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆలోచన పి ఫోర్ విధానాన్ని అమలుపరుస్తూ ఈ ప్రాంతంలో ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే సంకల్పంతో కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని మీ ముందుకు తీసుకొచ్చి అందరి ఆరోగ్య పరిరక్షణ ధ్యేయంగా వైద్య సేవలు అందిస్తున్నామని వీటిని మీరందరూ ఉపయోగించుకొని మీ ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ కోఆర్డినేటర్ కట్టా వెంకట నరసింహారావు మాజీ ఏఎంసీ చైర్మన్ గింజపల్లి రమేష్, ఉమ్మినేని పుల్లారావు, ఏ.రమేష్,గుత్తా హనుమంతరావు, వివిధ హోదాలో ఉన్న నాయకులు పాల్గొన్నారు.

